క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, కృష్ణాయపాలెం పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యర్రబాలెం విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపూడిలో 290మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని రేపూడిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 290 మందికి బీపీ, షుగర్, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. వైద్యురాలు ఎస్తేరురాణి మాట్లాడుతూ గ్రామంలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. మహిళలకు గైనిక్ పరీక్షలు, ఎముకల సంబంధిత వైద్యులతో ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణచైతన్యరెడ్డి, చరిష్మారెడ్డి, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్.వి.అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్‌ఎం వేళంగిణిరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులతో కూడా పరీక్ష కిట్లను సత్తెనపల్లికి చెందిన గన్నమనేని కన్‌స్ట్రక్షన్స్ శుక్రవారం అందజేసింది. ఈ సందర్భంగా కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జరగనున్న పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు జంపల రమేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేను కార్మికులంతా వినియోగించుకోవాలి

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డేను సచివాలయాల సిబ్బంది, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులంతా వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ సూచించారు. తాడేపల్లి కార్పొరేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు ఉద్యోగస్తులు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాలను ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేగా నిర్ణయించారని తెలిపారు. ఇందులో వచ్చిన కార్మికుల సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఆర్వో మురళి, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో మహిళా నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి కుట్టు శిక్షణ కేంద్రం ఆర్గనైజర్ గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం విజయవాడ బాధ్యులు కాట్రగడ్డ స్వరూపరాణి పాల్గొని మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్‌తో పాటు రాజకీయ అధికారంలో కూడా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీవీకే బాధ్యురాలు పి. విజయ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి స్వయం ఉపాధి పొందడానికి కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కుట్టు శిక్షణ ఉపాధ్యాయురాలు సీహెచ్. సుజాత, నిర్వాహకులు వెంకటరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్యకు ఘన స్వాగతం

- ప్రచారంలో ఆదరణ అపూర్వం
- లోకేష్‌కు రెండోసారి ఓటమి తథ్యం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



లావణ్యకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు. చిత్రంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మురుగుడు లావణ్యకు ప్రచారంలో వస్తున్న ఆదరణ ఆమోఘంగా ఉందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. పట్టణంలోని భార్గవపేట రామాలయంలో శుక్రవారం పూజలు నిర్వహించిన అనంతరం 16,17 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్యకు మహిళలు పెద్దఎత్తున హారతులతో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ కాండ్రు కమలలు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇరవై నాలుగు గంటలు మీకు అందుబాటులో ఉండే లావణ్యను, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తోందన్నారు. లావణ్య విజయం తథ్యమని, లోకేష్ రెండోసారి మంగళగిరిలో ఓటమి తప్పదని ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని తెలిపారు. ఈ పథకాలు మళ్లీ అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మంగళగిరిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు లావణ్యను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ. ఫిరోజ్, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, షేక్ శ్రీను, మురుగుడు సత్యం, మురుగుడు మధు, గూండా మధు, బేతపూడి నరసయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

నేడు భార్గవపేటలో ఎన్నికల ప్రచారం

పట్టణంలోని భార్గవపేట 18వ వార్డులో శనివారం ఉదయం 7.30 గంటలకు నియోజకవర్గ సమన్వయకర్త లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ కార్యాలయం తెలియజేసింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొంటారని పేర్కొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

కంతేరులో నీటికి హారతితో స్వాగతం

రూ.2.74 కోట్లతో నిర్మించిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామానికి చేరిన తాగునీరు



తాగునీటికి హారతి ఇస్తున్న గ్రామ మహిళలు, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కంతేరు(తాడికొండ): మండలంలోని కంతేరులో రూ.2.50 కోట్ల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన తాగునీటి పథక పనులు తుది దశకు చేరాయి. 90 శాతం పూర్తవ్వడంతో గుంటూరు చానల్ నుంచి గ్రామంలోని ఊర చెరువుకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. చెరువుకు నీరు వచ్చి చేరుతుండటంతో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. ఇరవై సంవత్సరాలుగా గ్రామస్తులు చెరువులో నీరు నిల్వలేక తాగునీటి ఎద్దటితో ఏటా వేసవిలో ఇబ్బందులు పడేవారు. ఈ ఏడాది సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుండటం, త్వరలో చెరువు నిండా నీరు చేరుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా పూర్తయినట్లు సర్పంచ్ బెజ్జం మహేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పన, పార్టీ గ్రామ అధ్యక్షుడు నంద్యాల సదానందరెడ్డి, ఉప సర్పంచ్ నరసింహారావు, నాయకులు శివారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్యామ్యూల్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సంచార జాతి మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ప్రభాకరరావు

మేడికొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రభాకరరావు సంచార జాతులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. డీబీఆర్సీ గుంటూరు జిల్లా మహిళ కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 10వేలు విలువ చేసే చీరల్ని ఉచితంగా అందజేశారు. ఈఓపీఆర్డీ పి.రవికుమార్, డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏఓ శామ్యూల్‌పాల్, మేడికొండూరు పంచాయతీ సెక్రటరీ శివరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అంతా సన్నద్ధం కావాలని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ ఏ. లక్ష్మీకుమారి, డెప్యూటీ కలెక్టర్ కె. స్వాతి, ఏఈఆర్‌ఓ తహసీల్దార్ కె. వెంకటేశ్వరరావు, అధికారులు కె. ప్రకాశరావు, బి. శివారెడ్డి, రవిబాబు, సీఐ ఏ. శ్రీనివాసరావు, ఎస్ఐ క్రాంతి కిరణ్, సిఐ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి బలమైన పునాది



మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య. వేదికపై ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నాయకులు

- బూత్ కన్వీనర్లు సమష్టిగా పని చేయాలి
- పార్టీ విజయానికి బాటలు వేయాలి
- పొన్నూరు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

తాడికొండ: ప్రతి ఇంటికీ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే రేపటి భవిష్యత్తుకు బలమైన పునాదులని పొన్నూరు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య అన్నారు. తాడికొండ షిర్డీసాయి, పర్తి సాయి మందిర ఆవరణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు సమష్టిగా సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రతి ఇంటికీ వివరించాలని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ రూ. లక్షల్లో సంక్షేమ పథకాల్ని ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా ఖాతాలకే అందించారని చెప్పారు. గతంలో చంద్రబాబు ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు సామాన్యుడిని దోచాయని విమర్శించారు. నేడు ప్రతి పేదవాడి ఇంటి తలుపు తట్టి సంక్షేమం అందుతుందంటే అందుకు జగనన్న చిత్తశుద్ధి పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి రాబోయే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో ఇక్కడ టీడీపీ ఎంపీగా పోటీ చేసి గెలిచిన గల్లా జయదేవ్ ఐదేళ్లలో ఒక్కసారి కూడా కనపడలేదని విమర్శించారు. మళ్లీ ఇప్పుడొక నాయకుడు వచ్చి అది చేస్తా.. ఇది చేస్తా అని హామీలిస్తున్నారని, వీరంతా డబ్బుతో ఓట్లను కొనాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో గెలిస్తే పత్తా లేకుండా పారిపోతారని తెలిపారు.

ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత మాట్లాడుతూ బూత్ లెవల్‌లో పనిచేసే నాయకులు, కార్యకర్తలు వేసే ప్రతి ఒక్క అడుగూ రేపటి పార్టీ విజయానికి నాంది అన్నారు. నియోజకవర్గంలో 244 బూత్‌లకు కన్వీనర్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 175 సీట్లలో విజయమే లక్ష్యంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధాని చేస్తానని చెప్పిన చంద్రబాబు, భూముల్ని అడ్డుపెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో పాటు అభివృద్ధి పేరుతో నిలువుదోపిడీ చేశాడని విమర్శించారు. మూడు రాజధానులు ఉండటం సాధ్యమేనని, తద్వారా అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. దేశంలో కూడా ఢిల్లీ శాసన రాజధానిగా కొనసాగుతుంటే ముంబయి వ్యాపార, వాణిజ్య రాజధానిగా విలసిల్లుతుందన్నారు. ఏపీలో కూడా వికేంద్రీకరణ సాధ్యమేనని, దాని ద్వారానే అందరికీ మంచి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, జేసీఎస్ జిల్లా నాయకులు రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్లు తాళ్ల శ్రీనివాసరెడ్డి, బండి ప్రసాద్, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు యాచకుడై ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి

వైఎస్సార్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో శుక్రవారం ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల బూత్ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో మేము సిద్ధం .. మా బూత్‌లు సిద్ధం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్ని పూర్తిగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. పార్టీ, కుల, మత, ప్రాంతాల్ని కూడా చూడకుండా అర్హులైతే చాలు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చేశారని చెప్పారు. దివంగత మహానేత వైఎస్. రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మహిళలందరికీ సంక్షేమం అందేలా చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాల్ని గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు తెలియజేయాలని చెప్పారు. నిజాయతీ కలిగిన ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడం మన అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాబోయే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరితేనే మరలా ఓటు వేయండని చెప్పిన ధీశాలి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా క్రీస్తు నగర్ వద్ద దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు సిద్ధయ్య, ఎంపీపీ మన్నం స్వప్న, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, జి. చంద్రం, పాలపాటి రఘు, పి. మరియబాబు, డి. నరేంద్రకుమార్, చేవూరి రామమోహన్ రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, మేడికొండూరు పార్టీ మండల అధ్యక్షుడు వంశీ, సచివాలయ కన్వీనర్లు, బూత్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువలో పాలన

పొన్నెకల్లు(తాడికొండ): సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. పొన్నెకల్లులో శుక్రవారం రాత్రి రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 నూతన భవనం, రూ.15 లక్షలతో పొన్నెకల్లు– దామరపల్లి రహదారి, కనెక్టివిటీ వంతెనను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ సౌభాగ్యానికి పట్టుగొమ్మలైన గ్రామసీమల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమని అన్ని గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి, అభివృద్ధి, సంక్షేమం చేరువ చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, ఎంపీటీసీ సభ్యులు కుంభా కోటేశ్వరి, నూతక్కి రాణి, యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, భీమవరపు బ్రహ్మారెడ్డి, శంకర్‌రెడ్డి, సీతారామాంజనేయరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో వివిధ అనారోగ్యాలతో ఆసుపత్రులలో చికిత్స పొందిన 22 మందికి రూ.17.81 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత శుక్రవారం పంపిణీ చేశారు. గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

సావిత్రి నటన అజరామరం

- చిర్రావూరులో విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి



మహానటి సావిత్రి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లి రూరల్ : మరణించి జీవించి ఉన్న మహానటి సావిత్రి అని, విగ్రహాన్ని ఆమె జన్మించిన గ్రామమైన చిర్రావూరులో ప్రారంభించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. విగ్రహ దాత, ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, సావిత్రి బంధువు దావులూరి పార్వతితో కలసి శుక్రవారం రాత్రి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సావిత్రి నటన అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో చిర్రావూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేకల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఈదుల మూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, కుంచనపల్లి పార్టీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, కొలనుకొండ పార్టీ అధ్యక్షుడు నూతక్కి శ్రీను, తాడేపల్లి రూరల్ వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, సావిత్రి అభిమానులు, చిర్రావూరు ప్రజలు పాల్గొన్నారు.

ఉండవల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ఉండవల్లి జామాయిల్ తోటలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానికులతో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జామాయిల్ తోటలో కరోనా తరువాత మూడు సంవత్సరాలలో కోటి రూపాయలతో గ్రావెల్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాయినగర్, బాపనయ్యనగర్ ప్రాంతాల్లో పంచాయతీగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు శిథిలావస్థకు చేరాయని, అక్కడ రహదారులు నిర్మించేందుకు అన్ని అనుమతులు తీసుకున్నామని, త్వరలోనే నిర్మిస్తామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఇక్కడ ఎమ్మెల్యేగా లావణ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి శివాలయం బోర్డు మెంబర్ కొల్లి మునలారెడ్డి, ఉండవల్లి జేసీఎస్ కన్వీనర్ అనిల్, కళ్లం సాంబిరెడ్డి, కళ్లం పిచ్చిరెడ్డి, పెనుమాక సొసైటీ అధ్యక్షుడు మేకా శివారెడ్డి, పెనుమాక పార్టీ అధ్యక్షుడు దామేశ్వరరెడ్డి, ఏఈ కిశోర్, సెక్రటరీ రాధాకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాలచెరువులో రోడ్లు ప్రారంభం

మంగళగిరి: పట్టణ పరిధిలోని రత్నాలచెరువులో రూ 1.50 కోట్లతో నిర్మించిన రోడ్లను శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండి. ఫిరోజ్, మహిళా నేత మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు

తెనాలి రూరల్: ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రజలకు సూచించారు. మండలంలోని కోపల్లె, గుడివాడ, కఠెవరం గ్రామాల్లో రూరల్ పోలీస్ సిబ్బంది, సీఐఎస్‌ఎఫ్ బలగాలు కలిసి శుక్రవారం రూట్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత ఉంటుందని తెలిపారు.

కేఎల్‌యూలో మహిళా దినోత్సవం సందడి



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ సుబ్బారావు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విజయవాడ కమర్షియల్ సేల్ టాక్స్ అధికారిణి లలిత కుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తు చేసేదిగా తెలిపారు. ఫెమ్ ఫ్లేర్ చైర్ పర్సన్ డాక్టర్ రూతు రమ్య మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలని పేర్కొన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, భార్యగా మహిళలు పలు రకాల పాత్రలు ఏక కాలంలో పోషిస్తూ అటు కుటుంబాన్ని, ఇటు విద్య, వ్యాపార, సామాజిక రంగాల్లో దూసుకుపోవడం అభినందనీయమని తెలిపారు. ఉత్సవంలో మొదటిరోజు టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్యక్రమాల్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం కార్యదర్శి కోనేరు శివకాంచనలత, ప్రో వీసీలు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్లు డాక్టర్ పి. లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఎ. ప్రియ, డాక్టర్ కె. సోని, డాక్టర్ మెహమూదా షేక్, పి. లలిత సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆటో

తెనాలిరూరల్: తెనాలి మండలం ఆటోనగర్ వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గాయపడ్డారు. వారిలో నలుగురు తీవ్రంగా గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో చిన్నారులు, మహిళలు ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి బాధితుల వివరాల మేరకు.. కొల్లిపర మండలం మున్నంగి గ్రామానికి చెందిన కొందరు కఠెవరంలో బంధువులు చనిపోవడంతో శుక్రవారం ఆటోలో వచ్చారు. సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో పది మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఆటోనగర్ వద్దకు రాగానే వీరి ఆటో ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్నవారు గాయపడ్డారు. వారిని రెండు 108 అంబులెన్సులలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ వేమూరి నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని అత్యవసర చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వేమూరి మల్లేశ్వరి, గురిందపల్లి అభినయ, నవతేజ్‌కు తీవ్రగాయాలు అయ్యాయని రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.